క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గోనెగండ్ల: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక (బస్టాండ్) పాఠశాలలో ఏర్పాటు చేసిన 236, 237 పోలింగ్ కేంద్రాలను ఎమ్మిగనూరు నియోజకవర్గం ఎన్నికల ఆర్‌ఓ చిరంజీవి, ఎంపీడీఓ సోనిబాయితో కలిసి గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం మండలానికి ఒకటి చొప్పున మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్, తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్ తదితర సదుపాయాలు ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం రహంతుల్లా, సిబ్బంది ఉన్నారు.

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రికి గురువారం పెద్ద సంఖ్యలో గర్భిణులు తరలివచ్చారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల నుంచి స్కానింగ్ పరీక్షల కోసం గర్భిణులు ఉదయమే ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. 632 మందికి స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టరు మైత్రేయి తెలిపారు. గర్భిణులు కూర్చునేందుకు కుర్చీలు కూడా ఏర్పాటు చేశామని, పేర్లు నమోదు చేసుకున్న ప్రతి గర్భిణీకి స్కానింగ్ పరీక్షలు చేసి పంపుతున్నట్లు చెప్పారు. డాక్టర్లు సుజిత, ఫాతిమా తదితరులు వైద్యసేవలందించారు. స్కానింగ్ పరీక్షల కోసం వచ్చిన వారికి మార్నింగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

గోనెగండ్ల: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యమని డీఎస్పీ సీతారామయ్య పేర్కొన్నారు. ఆయన గురువారం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో సీఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల్లో గొడవలు సృష్టించడం, ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరింపులకు గురిచేయడం వంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేయరాదన్నారు. అలాగే రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వారిపై పోలీసు నిఘా ఉంటుందని, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏఎస్‌ఐ తిమ్మారెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని మంత్రాలయం మండలంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యంను పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో పట్టుబడిన మద్యం, బైక్‌ను మీడియాకు చూయించారు. ఆయన మాట్లాడుతూ.. మంత్రాలయం మండలం సూగూరు గ్రామానికి కి.మీ దూరంలోని నాలుగు కూడళ్ల వద్ద తెల్లవారుజామున వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్‌పై వచ్చిన వ్యక్తి వాహనాన్ని వదిలి పరారయ్యాడన్నారు. దగ్గరకు వెళ్లి చూడగా బైక్‌తో పాటు ఐదు బాక్సుల్లోని 480 (90 ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.55 వేలు ఉంటుందని తెలిపారు. సర్కిల్ పరిధిలో ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసినా 94409 02579 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


భాస్కర్ (ఫైల్)

గోనెగండ్ల: మండల పరిధిలోని వేముగోడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, ఎంపీపీ స్కూల్ కమిటీ చైర్మన్ కోటకొండ భాస్కర్(32) కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. భాస్కర్‌కు బుధవారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం ఆయన మృతి చెందారు.మృతుడికి భార్య మహేశ్వరి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కేవీ కృష్ణారెడ్డి, నరేష్ రెడ్డి మృతుడి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భాస్కర్ మృతి పార్టీకి తీరనిలోటని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆదోనికి పార్థసారథి ఏం చేశారో చెప్పాలి


మాట్లాడుతున్న మునిస్వామి, రేణుక

ఆదోని అర్బన్: బీజేపీ అభ్యర్థి పార్థసారథి ఆదోని ప్రజలకు ఏం చేశారని ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మునిస్వామి, ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక ప్రశ్నించారు.వారు గురువారం స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. పార్థసారథి ప్రచారంలో మారణాయుధాలు చూపడం, నాలుక కోస్తా అనడం, రెచ్చగొట్టేలా మాట్లాడడం సరైంది కాదన్నారు. ఆదోనిలో ఎవరికైనా సేవ చేశావా? ఎక్కడి నుంచో వచ్చి ఎమ్మెల్యేగా పోటీ చేస్తే ప్రజలు ఎలా నమ్ముతారు అనుకున్నావు. కనీసం రెండు, మూడేళ్లైనా ఆదోని ప్రజలకు దగ్గరగా ఉంటూ వారి సమస్యలు తెలుసుకున్నావా అని ప్రశ్నించారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని తిట్టడం లాంటివి చేయడం మానుకోవాలని హితవు పలికారు.

ఆదరిస్తే మరింత అభివృద్ధి


ప్రచారంలో పెద్ద ఎత్తున పాల్గొన్న పార్టీ శ్రేణులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: గడిచిన ఐదేళ్లలో ఆదోని నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాం.. మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపుతామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఆదోనిలో రూ.500 కోట్లకు పైగా ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. ఎమ్మెల్యే గురువారం ఆదోని పట్టణంలోని 5, 6, 8, 9, 17 వార్డులు, పాత పోస్టాఫీసు ఏరియా, కునిమొల్లా ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు తాయన్న, నరసింహులు, రఘునాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, అశోక్ నేతృత్వంలో ప్రచార కార్యక్రమం జరిగింది. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రోడ్డులో బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మరోమారు మోసం చేసేందుకు వస్తున్నారని ప్రజలు ఆయన మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. 59 నెలల వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి చూపించాడన్నారు. ఆదోనిలో రూ.470 కోట్లతో మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో రూ.27 కోట్లతో 320 పడకల భవనాన్ని నిర్మించడం జరిగిందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రూ.10 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల, ఉర్దూ జూనియర్ కళాశాల, వసతిగృహం చేపట్టడం జరిగిందన్నారు. రూ.420 కోట్లతో స్థల, భూసేకరణ, ఆగిపోయిన బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇది కాదా అభివృద్ధి అంటూ ప్రతిపక్షాలను ప్రశ్నించారు. ఆదోనిలో భూదందాలు ఎక్కువగా జరుగుతున్నాయని, బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి చేసే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఏ ఒక్క ఆధారం ఉన్నా చూపించాలని, నిరూపణ అయితే రాజకీయాలకే దూరమవుతానని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. ఈనెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైస్ చైర్మన్ నరసింహులు, ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు, నారీమణులు పాల్గొన్నారు.

కదిలిన నారీ లోకం

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌పై రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ 18, 19, 20 వార్డుల్లో గురువారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ ప్రచారఘట్టంలో నారీమణులు కదం తొక్కారు. వార్డు కౌన్సిలర్ చలపతి, చిన్నా ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం జరిగింది. మహిళలు పట్టలేనంత ఉత్సాహంతో వీధివీధి తిరుగుతూ ప్రచారం చేశారు. జగనన్నకే ఓటు వేద్దాం.. రాష్ట్రం, పట్టణం, గ్రామం అభివృద్ధి చేసుకుందామని పిలుపునిస్తూ ప్రచారం చేశారు. ప్రచారానికి కదిలివచ్చిన మహిళలకు ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అభివాదం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వేయించి అఖండ మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

సంక్షేమ పాలనకు పట్టం కట్టాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి న్యాయవాదులను అభ్యర్థించారు. గురువారం స్థానిక ద్వారకా ఫంక్షన్‌హాల్‌లో ఆదోని న్యాయవాదుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. ఎన్‌డీయే కూటమి అభ్యర్థులు చేసే తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మేధా సంపత్తులైన న్యాయవాదులు వాస్తవాలను గమనించి మంచి చేసే వారికే పట్టం కట్టాలని కోరారు. అమలు చేయలేని సూపర్ సిక్స్ పథకాలతో మభ్యపెడుతున్న చంద్రబాబుకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు.


ఎమ్మెల్యే ప్రచారానికి తరలివచ్చిన మహిళలు

కురువల ఆత్మీయ సమ్మేళనం

పట్టణంలోని మార్కెట్‌యార్డు, బసాపురం రోడ్డులోని ఫంక్షన్‌హాల్‌లో కురువల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం దుబ్బ మల్లి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కురువలను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నీతికి, నిజాయితీకి, నమ్మకానికి కురువలు ఎంతో ప్రతీకమని చెప్పారు. కురువలను విస్మరించిన ప్రభుత్వాలకు మనుగడ ఉండదన్నారు.

టీడీపీ బూటకపు హామీలను నమ్మొద్దు


చేనేత మహిళల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాలకు మేలు చేసిన సీఎం వైఎస్ జగనన్నకు అండగా నిలిచి, మోసపూరిత హామీలిస్తున్న టీడీపీకి గుణపాఠం చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక పిలుపునిచ్చారు. ఆమె గురువారం పట్టణంలోని కుర్ణి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశానికి 17, 18, 19, 20, 21 వార్డుల నుంచి వేలాదిగా మహిళలు తరలివచ్చి వైఎస్సార్‌సీపీకి సంపూర్ణమద్దతు పలికారు. అభ్యర్థి బుట్టా రేణుక మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వస్తే జగనన్న అమలు చేసిన ఏ ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు కాదన్నారు. వారి పాలనంతా దోచుకోవడానికేనని విమర్శించారు. పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలను అడ్డుకుంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. అమలుకు సాధ్యంకాని సూపర్ సిక్స్ పథకాలంటూ మీ ముందుకు వస్తున్నారని వారిని నమ్మి మోసపోవద్దన్నారు. జగనన్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన ప్రతి కుటుంబం ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆదరించాలని విన్నవించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజా సేవకురాలిగా పనిచేస్తానని, వార్డుల్లో రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటువేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, నాయకులు రియాజ్‌అహమ్మద్, వీరేంద్ర, పూజేశ్వరి, సోమేష్, బంగిశ్రీరాం, తారా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఆడబిడ్డను ఆదరించండి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శివన్న నగర్ బోర్డు వద్ద 3, 4, 5, 6 వార్డుల చేనేత మహిళలతో ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అలాగే ఎంబీ చర్చి సమీపంలో 7, 8 వార్డుల మహిళలతో సమావేశం నిర్వహించారు. శాప్ చైర్మన్ మాచాని వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు, మండల కన్వీనర్ బీఆర్.బసిరెడ్డి, వీరశైవ లింగాయితీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ తదితరులు మాట్లాడారు. బుట్టా రేణుక మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మద్దతుతో మీ ముందుకు వచ్చానన్నారు. చేనేత ఆడబిడ్డనైన తనను ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విన్నవించారు. గతంలో పార్లమెంట్ సభ్యురాలిగా చేనేతల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేశానని, ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత సేవ చేస్తానన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

ఎమ్మిగనూరురూరల్: సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పిలుపునిచ్చారు. ఆమె గురువారం సాయంత్రం పార్లపల్లి గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. ప్రజలు భారీగా తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని బుట్టా రేణుక కోరారు. బుట్టా ప్రతూల్, సాహితి, సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.అలాగే కె.బసాపురంలో బీఆర్.బసిరెడ్డి ఆధ్వర్యంలో బుట్టా ప్రతుల్, సాహితి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.


బుట్టా రేణుక సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన తిప్పనూరు నాయకులు


వైఎస్సార్‌సీపీలో చేరిన హెచ్.కైరవాడి గ్రామ టీడీపీ నాయకులు

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎమ్మిగనూరుటౌన్: గోనెగండ్ల మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తిప్పనూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నాగార్జునరెడ్డి, ఉపసర్పంచ్ చాకలి మల్లికార్జున, రంగన్న, రఘు, తలారి రాముడుతో పాటు 300 మంది వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి బుట్టా రేణుక, బుట్టా ప్రతుల్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా హెచ్.కైరవాడికి చెందిన టీడీపీ నాయకుడు రంగుస్‌బాష, మహబుబ్‌బాష వైఎస్సార్‌సీపీలో చేరారు.

సూపర్ సిక్స్ అట్టర్‌ఫ్లాప్ కావాల్సిందే


బాణసంచా పేల్చి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు


కౌతాళం రోడ్ షో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం/కౌతాళం: జగనన్న నవరత్నాల ముందు చంద్రబాబు సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ కావాల్సిందేనని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గురువారం రాత్రి కౌతాళంలో రోడ్ షో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుకు సొంతంగా ఆలోచించే శక్తి లేదని, ఇతర పార్టీ పథకాలను కాపీ కొట్టి కిచిడీ మేనిఫెస్టో రూపొందించారని ఎద్దేవా చేశారు. జగనన్న నవరత్నాలు పేదలకు వరాలుగా మారాయని వివరించారు. బీదల జీవన ప్రమాణాలు పెంచేందుకు ఎంతగానో దోహదపడ్డాయన్నారు. అమ్మ ఒడి, మన బడి నాడు–నేడు, సచివాలయ వ్యవస్థ, వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ రైతు భరోసా పథకాలు ప్రజల హృదయాలను గెలుచుకున్నాయని గుర్తు చేశారు. చంద్రబాబు సూపర్ సిక్స్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. స్థానిక టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డికి గుర్తింపు తెచ్చిందే తమ పార్టీ అని చెప్పారు. తమ ప్రభుత్వంలో నియోజకవర్గంలో ఆరు ఎత్తిపోతల పథకాలు తీసుకొచ్చామని చెప్పారు.

విజయోత్సవాన్ని తలపించేలా :

వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయోత్సవాలను తలపించేలా ఊరూరా ప్రచార సంబరాలు చేసుకుంటున్నారు. అభిమాన జెండాలను చేతబూని పార్టీపై ఎనలేని అభిమానం చాటుకుంటున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళంలో గురువారం రాత్రి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి రోడ్ షో చేపట్టారు. రోడ్ షో సందర్భంగా పుర వీధులు జగనన్న నినాదంతో హోరెత్తాయి. బాణసంచాలు, గజమాలలు, డప్పు దరువులతో ప్రచార పోరులో సాగిపోయారు. పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో–ఆప్షన్ మెంబర్ మాబుసాబ్, సర్పంచు పాల్ దినకర్, నాయకులు దాట్ల కృష్ణంరాజు, అవతారం, తిక్కయ్య, సమ్మద్, వడ్డెరాము, ఉలిగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి


మాచాపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

నందవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని, అందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఆ పార్టీ నాయకులు గడ్డం నారాయణరెడ్డి, రామకోటేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని హాలహర్వి, మాచాపురం గ్రామాల్లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నమూనా ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానాన్ని వివరించారు. నాయకులు గాలెన్న, సత్యన్న, జయరాజు, శీను, శాంతిరాజు, హాజరత్‌బిలాల్, జయన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను కలిసి ప్రచారం

మంత్రాలయం: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి నేతృత్వంలో ప్రచారం చేపట్టారు. రామచంద్రనగర్‌లో పర్యటించి ఉపాధి కూలీలతో ముచ్చటించారు. తమ పార్టీకి రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను గెలిపించాలని అభ్యర్థించారు. అలాగే మాలపల్లి గ్రామంలో ఎమ్మిగనూరు కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురురాజరావు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని ప్రచారం చేశారు. సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, సీతారామిరెడ్డి, మహిళా నాయకురాలు విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

జోరువానలో ప్రచారం

మంత్రాలయం/కౌతాళం: అబద్ధాలు చెప్పడం, మోసపూరిత హామీలివ్వడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి బ్లడ్‌లోనే లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ధరణీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కౌతాళం మండలం పొదలకుంట, మదిరె, సులేకేరి, చూడి, ఓబులాపురం, ఉరకుంద, కామవరం గ్రామాల్లో రోడ్ షో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. అధికారం కోసం ఉత్తుత్తి హామీలు ఇవ్వడం ఏకోసానా లేదని వెల్లడించారు. మాట ఇచ్చామంటే కచ్చితంగా నెరవేర్చుతామన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకు అబద్ధాలతో ఊరేగడం అలవాటైందన్నారు. ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసే పనిలో పడ్డారని ఆరోపించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.రాఘవేంద్రరెడ్డి బీసీలంతా ఏకం కావాలని, స్వార్థం కోసం వరసలు కలుపుతున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుటుంబం ఏరోజూ కులమత బేధాలు చూపలేదని స్పష్టం చేశారు. పొదలకుంట, మదిరె గ్రామాల్లో ఇంటింటికి కుళాయి వ్యవస్థతోపాటు డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

జడివానలో కొనసాగిన రోడ్ షో

జోరువానలోనూ వైఎస్సార్‌సీపీ నేత వై.ధరణీధర్ రెడ్డి ప్రచారం కొనసాగించారు. మదిరె, సులేకేరి గ్రామాల్లో జోరువాన కురుస్తున్నా రోడ్ షోను కానిచ్చారు. అభిమానులు, మహిళలు సైతం వానలో తడుస్తూనే ప్రసంగం ఆలకించారు. పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఉరకుంద ఈరన్న ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజుగౌడ్, నాయకులు మల్రెగౌడ్, ఏకాంబరరెడ్డి, మండల ఇన్‌చార్జ్ వెంకట్రామిరెడ్డి, సర్పంచులు లక్ష్మి, నాయకులు రమేష్, రాజారెడ్డి, యల్లప్ప, రాజేంద్ర, మల్లయ్య, మూకన్న తదితరులు పాల్గొన్నారు.


సులేకేరిలో జోరువానలో ప్రసంగిస్తున్న వై.ధరణీధర్ రెడ్డి


పొదలకుంటలో ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

వార్డుల్లో విస్తృత ప్రచారం


13వ వార్డులో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక గెలుపు కోసం మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ వార్డు ఇన్‌చార్జ్‌లు విస్తృత ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. గురువారం పట్టణంలోని 13వ వార్డులో జేసీఎస్ కన్వీనర్ షబ్బీర్‌అహమ్మద్, వక్ఫ్‌బోర్డ్ మాజీ డైరెక్టర్ అల్తాఫ్, 24వ వార్డులో కౌన్సిలర్ రామాంజినమ్మ, రుద్రాక్షాల బజారి, 18వ వార్డులో ఇన్‌చార్జ్ సోమేష్, అబ్రార్‌లతో పాటు పట్టణంలోని అన్ని వార్డుల్లో నాయకులు విస్తృత ప్రచారం చేశారు.


24వ వార్డులో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ తదితరులు

నవరత్నాలతో పేదల ఇళ్లలో వెలుగులు


బుట్టా ప్రతుల్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పూలచింత టీడీపీ నాయకులు

నందవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు నింపారని వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా ప్రతుల్ అన్నారు. ఆయన గురువారం నందవరంలో మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, సర్పంచ్ తోట సావిత్రి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను గమనించి మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. రెండు ఓట్లు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యకు ఫ్యాన్ గుర్తుకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు బసవప్పగౌడ్, ఆదాం, బుజ్జిబాబు, చాంద్‌తాత, ఎల్లాగౌడ్, రమేశప్పగౌడ్‌లు పాల్గొన్నారు.

50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎమ్మిగనూరుటౌన్: నందవరం మండలంలోని పూలచింత గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో యువ నాయకుడు ప్రతుల్ సమక్షంలో సురేష్, బోయ శివ, శేఖర్, వీరేష్, రామకృష్ణ, మహదేవ్, శేక్షావలి, రంగస్వామితో పాటు మరికొందరు వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీ మేనిఫెస్టో బూటకం


కనకవీడులో ప్రచారం చేస్తున్న కేఆర్ లక్ష్మీకాంతరెడ్డి తదితరులు


ముగతిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నందవరం: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో బూటకమని, ఆయన మాటలు నమ్మితే నట్టేట మునిగినట్లేనని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ లక్ష్మీకాంతరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి అన్నారు. వారు గురువారం మండల పరిధిలోని కనకవీడు, ముగతి గ్రామాల్లో సర్పంచ్ మద్దీశ్వరి, వైస్ ఎంపీపీ నడిపి షేక్‌సాహెబ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగనన్నకు మరోసారి అండగా నిలవాలని కోరారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు (ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు) వేయాలని విన్నవించారు. నాయకులు శివన్న, వెంకటరాముడు, స్వామిదాసు, మత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోసిగి మండలంలో..

కోసిగి: ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని మరోసారి గెలిపించాలని కోరుతూ వివిధ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. గురువారం కోసిగిలో రైల్వే స్టేషన్ రోడ్డులో మహంతేష్ స్వామి, జగదీష్ స్వామి, వడ్డె వీధిలో గానిగ వీరస్వామి, ముకుంద కృష్ణమూర్తి, కొరివి నాగరాజు, నాడుగేని వీధిలో నాగరాజు, అయ్యప్ప స్వామి గుడి కాలనీలో అయ్యప్ప, బసవరాజు, కడపాళెంలో ఎంపీపీ ఈరన్న, బుల్లి నరసింహులులతో పాటు అగసనూరు, సాతనూరు, ఆర్లబండ, కందుకూరు, తదితర గ్రామాల్లో ప్రచారం చేపట్టారు.


కోసిగిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మెల్యే కుటుంబసభ్యుల ప్రచారం


పెద్దకడబూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కుటుంబసభ్యులు, నాయకులు


పెద్దకడబూరులో ప్రచారం చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పెద్దకడబూరు: ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కుటుంబ సభ్యులు అనూషరెడ్డి, వీణారెడ్డి, కుమారిరెడ్డి, ప్రియాంకరెడ్డి, మమత రెడ్డి కోరారు. పెద్దకడబూరులో ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ రాజేశ్వరి ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి ఓట్లను అభ్యర్థించారు.వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే మరో ఐదేళ్లపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మీ ఇంటి తలుపు తడతాయన్నారు. టీడీపీ నాయకుల కల్లబొల్లి మాటాలు నమ్మి మోసపోవద్దని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజినేయులు, రవిచంద్రరెడ్డి, ఉవిజయేంద్రరెడ్డి ఇంటింటి ప్రచారంలో పాల్గొని ఓట్లను అభ్యర్థించారు. అలాగే కంబదహాల్ గ్రామంలో యువనాయకుడు ప్రభుకిశోర్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, సాయికిరణ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఉపాధి కూలీలకు బ్యాలెట్ నమూనాను చూపించి ఓటువేసే విధానాన్ని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఆదోని రూరల్: ఆదోనిలో గురువారం పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ముగిసిందని ఎన్నికల అధికారి శివనారాయణశర్మ తెలిపారు. గురువారం నెహ్రూ మెమోరియల్ స్కూల్‌లో చివరిరోజు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ద్వారా ఆదోని నియోజకవర్గంలోని 28 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతర జిల్లాలకు చెందిన ముగ్గురు ఓటు వేశారు. ఆదోని నియోజకవర్గంలో నాలుగు రోజులు కలిపి మొత్తం 1698 మంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇతర జిల్లాలకు సంబంధించి 152 మంది ఓటు వేసినట్లు చెప్పారు. ఆదోని నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్‌కు సంబంధించి 66 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో ఐదుగురు మరణించారని, ఇద్దరు పెండింగ్ ఉండగా 59 మంది హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు.